
దరఖాస్తులు పెరిగేనా..! 2


పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

19-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## పేకాడితే అరెస్ట్‌లు తప్పవు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దీపావళి రోజు పేకాట ఆడితే కఠినచర్యలు తప్పవని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎవరైనా పేకాడితే అరెస్టు చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అలాగే ప్రజలు సైతం ఆయా ప్రాంతాల్లో ఎవరైనా పేకాట ఆడినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వాళ్ల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.




కామారెడ్డి జిల్లాలోని ఆర్టీఏ చెక్ పోస్టులపై మరోసారి ఏసీబీ సోదాలు జరిగాయి. మూడు నెలల వ్యవధిలోనే ఏసీబీ అధికారులు మరోసారి దాడులు చేపట్టడం జిల్లాలో కలకలం రేపింది. పొందుర్తి, సలాబత్‌పూర్ చెక్ పోస్టుల్లో శనివారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. వాహనాల డ్రైవర్లు, ఓనర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఏజెంట్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

# చెక్ పోస్టులపై ఏసీబీ దాడులు

- అర్ధరాత్రి తర్వాత ఆకస్మిక తనిఖీలు
- రూ.87 వేల నగదు సీజ్
- ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా వసూళ్లు

ఏసీబీ అధికారులు గతంలో నిఘా పెట్టి పగటి పూట, తెల్లవారుజామున దాడులు చేపట్టేవారు. ప్రస్తుతం మాత్రం అర్ధరాత్రి సోదాలు చేయడం గమనార్హం. గతంలో కూడా చెక్ పోస్టులపై దాడులు పగటి సమయంలోనే జరిగాయి. ప్రస్తుతం అర్ధరాత్రి తర్వాత దాడులు చేయడం వెనక ఆంతర్యం ఏమిటనే చర్చ జరుగుతోంది. జిల్లాలో శనివారం రాత్రి 12 గంటల తర్వాత ఒకే సమయంలో పొందుర్తి, సలాబత్‌పూర్ ఆర్టీఏ చెక్ పాయింట్లపై దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో సలాబత్‌పూర్ చెక్ పోస్టులో దాదాపు రూ.36 వేలు స్వాధీనం చేసుకుని ఒక ప్రైవేట్ ఏజెంట్‌ను అదుపులోకి తీసుకున్నట్టుగా తెలుస్తోంది. పొందుర్తి చెక్‌పోస్టులో రూ.51,300 సీజ్ చేసిన అధికారులు, అసిస్టెంట్ ఎంవీఐతో పాటు ముగ్గురు ప్రైవేట్ ఏజెంట్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

### మూడు నెలల వ్యవధిలోనే..

జిల్లాలో జూన్ 26న సలాబత్‌పూర్ చెక్‌పోస్టులో ఏసీబీ తనిఖీలు చేపట్టి రూ.1.81 లక్షలు సీజ్ చేసింది. జులై 16న పొందుర్తి చెక్ పోస్టులో చేపట్టిన సోదాల్లో రూ.52 వేలు దొరికాయి. ఈ దాడుల తర్వాత రాష్ట్రంలో అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ప్రభుత్వం ఎత్తి వేస్తున్నట్టు ప్రచారం సాగింది. ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది. చెక్ పోస్టులు ఎత్తివేస్తారనే ప్రచారం నేపథ్యంలో హఠాత్తుగా మరోసారి ఏసీబీ దాడులు చేయడం గమనార్హం.

### ఎత్తివేస్తారా.. కొనసాగిస్తారా..?

ఏసీబీ దాడులతో మరోసారి చెక్ పోస్టుల అంశం తెరపైకి వచ్చింది. చెక్ పోస్టులను ఎత్తివేసే ఆలోచనలో ఉంటే ఏసీబీ ద్వారా దాడులు చేయించాల్సిన అవసరం లేదనే వాదన వినిపిస్తోంది. అదే సమయంలో ప్రభుత్వానికి ఆ ఆలోచన లేదని, అధికారుల్లో పారదర్శకత తీసుకువచ్చి ఆన్‌లైన్ ద్వారా చెక్ పోస్టులను నిర్వహించేలా ఆలోచన చేస్తుందని ప్రచారం సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన దాడుల ద్వారా చెక్ పోస్టులలో అక్రమ వసూళ్లకు చెక్ పెట్టాలన్న ఉదేశంలో ప్రభుత్వం ఉన్నట్లు చర్చ సాగుతోంది.

### వసూళ్ల ఆరోపణలతోనేనా?

చెక్ పోస్టు అధికారులు, సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించాల్సి ఉంటుంది. అక్రమంగా ఏమైనా తరలిస్తున్నట్టు తేలితే ఆ వాహనాన్ని సీజ్ చేయాలి. అయితే చెక్ పోస్టులలో ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. పైగా అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకుని దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపించాయి. మూడు నెలల క్రితం దాడులు చేపట్టినా.. మళ్లీ వసూళ్లు మొదలెట్టారని ఫిర్యాదుల నేపథ్యంలోనే ఏసీబీ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.



## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పేకాట ఆడినందుకు ఇప్పటికే 39 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. పేకాట దాడుల్లో జిల్లాలో రూ.79,390 నగదు, 29 సెల్ ఫోన్లు, 9 బైకులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పేకాట స్థావరాలపై నిఘా కొనసాగుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలు, ఫామ్ హౌస్‌లు, ఇళ్లల్లో.. బహిరంగ ప్రదేశంలో జూదం, ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712686133కు ఫోన్ చేయాలని, లేకపోతే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు, 100 డయల్‌కు సమాచారం అందించాలని కోరారు.



## లైసెన్స్ ఉన్న షాపుల్లోనే పటాకులు కొనుగోలు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే పటాకులు కొనుగోలు చేయాలని జిల్లా ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుధాకర్ ప్రజలకు సూచించారు. జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 94 పటాకుల షాపులకు అనుమతి ఇచినట్లు తెలిపారు. ఒక షాప్‌కు మరో షాప్‌కు మధ్య 3 మీటర్ల దూరం ఉండాలని, ప్రతి షాపు వద్ద 200 లీటర్ల నీటి బ్యారెల్ ఉండాలని 5 కిలోల ఫైర్ సేఫ్టీ సిలిండర్ ఉండాలన్నారు. ప్రజలు పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఇంటిముందు పటాకులు కాల్చేముందు డోర్లకు పరదాలు లేకుండా చూసుకోవాలి, పటాకులు కాల్చే సమయంలో నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోడ్లు, ఇళ్ల మధ్య పటాకులు కాల్చవద్దని, ఓపెన్ స్థలాల్లో మాత్రమే కాల్చాలన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.



## బాసరలో లలితా చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ఇందూరు:** శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో ఆదివారం లలితా చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జగద్గురు విధు శేఖర భారతీ మహాస్వామి సమక్షంలో ఆలయంలో హోమం, శిఖర మహాకుంభాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. బాసర క్షేత్రంలో లలితా చంద్రమౌళీశ్వర ఆలయం నిర్మించి పూజాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్, శృంగేరి మఠం బాసర ట్రస్ట్ సభ్యులు, వేద పండితులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## బంద్‌కు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు

**అక్షరటుడే, ఇందూరు:** బీసీ రాష్ట్ర బంద్‌కు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని కేర్ కళాశాలలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంద్ ఆరంభం మాత్రమేనని రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదన్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ ప్రమోద్‌కు నివాళులర్పించారు. ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఆంజనేయులు, రవీందర్, శంకర్, వినోద్, అజయ్, శ్రీలత, విజయ్, చంద్రకాంత్, సాయి, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రైఫిల్ షూటింగ్‌లో జిల్లావాసికి స్వర్ణం



**అక్షరటుడే, కామారెడ్డి:** రైఫిల్ షూటింగ్ కమ్ సెలక్షన్ అండర్-17 విభాగంలో భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన పేరం అక్షిత ప్రతిభ చూపింది. ఎంపికల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అక్షిత హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ విజయ్ శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ అంబుజ పురానిక్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ స్కూల్ డిస్ట్రిక్ట్ లెవెల్ రైఫిల్ షూటింగ్ పోటీలు నాంపల్లిలోని మదీనా పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 16 నుచి 18 వరకు జరిగాయి. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు హుస్సేన్, సాహశ్రీ, నిరంజన్ రెడ్డి, జీవన జ్యోతి పాల్గొన్నారు.



# దీపావళి సందడి

- కళకళలాడుతున్న మార్కెట్లు
- పటాకుల దుకాణాల్లో జోరుగా కొనుగోళ్లు

దీపావళి సందడి మొదలైంది. ఉమ్మడి జిల్లావాసులు లక్ష్మీదేవి పూజలకు సిద్ధమవుతున్నారు. దీంతో నిజామాబాద్ నగరంలోని గంజ్, గాంధీచౌక్, ఆర్‌ఆర్ చౌరస్తా, ప్రగతి నగర్, వీక్లీ బజార్, కంఠేశ్వర్, సుభాష్ నగర్ తదితర ప్రాంతాల్లో పూలు, గుమ్మడికాయలు, లక్ష్మీదేవి పటాల విక్రయాల సందడి నెలకొంది. నగరంలోని పాలిటెక్నిక్ క్రీడామైదానంలో పటాకుల దుకాణాలు వెలిశాయి. అలాగే కామారెడ్డి పట్టణంలో మార్కెట్లు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి.

– అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్/కామారెడ్డి

– మరిన్ని ఫొటోలు 2వ పేజీలో..

# కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడి అరెస్టు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్ విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ ప్రమోద్ దారుణ హత్యోదంతంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడు రియాజ్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని సీపీ సాయిచైతన్య వెల్లడించారు. నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపూర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ ఆరో టౌన్ పరిధిలో రియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ ప్రాంతంలో ఆసిఫ్ అనే వ్యక్తిపై రియాజ్ దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఈ పెనుగులాటలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు అప్రమత్తమై నిందితుడు రియాజ్‌ను పట్టుకున్నారు. కాగా.. చికిత్స నిమిత్తం వీరిద్దరిని ఆస్పత్రికి తరలించారు.

### కానిస్టేబుల్‌ను పొడిచి పారిపోయిన నిందితుడు

పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్న రియాజ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా.. కానిస్టేబుల్ ప్రమోద్‌ను ఛాతిలో పొడిచి పారిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రమోద్ పరిస్థితి విషమించడంతో మరణించాడు. కాగా.. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న కమిషనరేట్ పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. డీజీపీ సైతం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఐజీని ప్రత్యేకంగా రంగంలోకి దింపారు. అనంతరం పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ ఆరో ఠాణా పరిధిలో నిందితుడు రియాజ్ ఉన్నట్లు పోలీసులకు ప్రాథమిక సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి ఆరో ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిందితుడు రియాజ్ ఉపయోగించిన బైక్ .. స్థానిక కెనాల్ సమీపంలో లభించింది. అంటే నిందితుడు కెనాల్ లోని నీటిలో దూకి పారిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. దీంతో డ్రోన్‌ల సాయంతో నిందితుడి కోసం జల్లెడ పట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం సారంగపూర్ శివారులో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అయితే రియాజ్ ఆసిఫ్ అనే వ్యక్తిపై దాడి చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెనులాట జరిగింది. పోలీసులు వెంటనే రియాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కొత్త మద్యం దుకాణాల టెండర్లకు అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు. టెండర్ల దరఖాస్తు ఫీజును గతేడాది కంటే అదనంగా రూ.లక్ష పెంచి.. రూ.3 లక్షలు చేసింది. దీంతో వ్యాపారులు టెండర్లు వేయడానికి ఆసక్తి చూపించలేదు. అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం గడువును మరో ఐదు రోజులు పొడిగించింది. ఇప్పుడైనా అనుకున్న స్థాయిలో వస్తాయో లేదో చూడాలి మరి.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# దరఖాస్తులు పెరిగేనా..!

■ కొత్త మద్యం షాపుల టెండర్లకు తగ్గిన అప్లికేషన్లు ■ గడువు పెంచిన ప్రభుత్వం ■ దరఖాస్తుల పెంపు కోసం ఎక్సైజ్ శాఖ నానా తంటాలు

కొత్త మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ ఈనెల 18తో ముగిసింది. అయితే అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరణకు గడువు పెంచింది. కొత్త పాలసీ మద్యం టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి మద్యం వ్యాపారులకు అవకాశం కల్పించింది.

### జిల్లాలో దరఖాస్తులు తక్కువే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం టెండర్లకు ఈ ఏడాది తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో గతంలో 3,578 దరఖాస్తులు రాగా, ఈసారి 2,229కి తగ్గింది. ఇక కామారెడ్డి జిల్లాలో గతేడాది 2,204 దరఖాస్తులు రాగా, ఈసారి 1,444 మాత్రమే వచ్చాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ యేడు ఇప్పటివరకు 4,077 మాత్రమే దరఖాస్తులు రాగా, నిజామాబాద్ జిల్లాలో 2,633, కామారెడ్డి జిల్లాలో 1,444 దరఖాస్తులు వచ్చాయి. నిన్నటి వరకు నిజామాబాద్ డివిజన్‌లో 908, బోధన్‌లో 427, ఆర్మూర్‌లో 577, భీమ్‌గల్‌లో 355, మోర్తాడ్‌లో 366 దరఖాస్తులు అందాయి. ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం ఈనెల 23 వరకు దరఖాస్తు గడువు పెంచారు.

### రాష్ట్ర బంద్ సాకుతో..

రాష్ట్ర వ్యాప్తంగా టెండర్ల ప్రక్రియ 15 రోజుల నుంచి కొనసాగుతున్నా.. శనివారం బీసీ ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్తంగా బంద్ పిలుపునివ్వడంతో దీనిని సాకుగా ఎక్సైజ్ శాఖ అధికారులు చూపిస్తున్నారు. బంద్ కారణంగా ఆశావహులు దరఖాస్తు చేసుకోలేకపోయారని, ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాంకుల ఇబ్బంది కారణంగా పొడిగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బంద్ కొనసాగినప్పటికీ నిజామాబాద్ జిల్లాలో 1,153 మద్యం టెండర్లకు అప్లికేషన్లు వచ్చాయి. ఇది ఎలా సాధ్యమైందని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నిజామాబాద్‌లో 397, బోధన్ 121, ఆర్మూర్ 303, భీమ్‌గల్ 168, మోర్తాడ్ 164, డివిజన్ల వారీగా బంద్ రోజే ఇన్ని దరఖాస్తులు రావడం గమనార్హం.

### 27వ తేదీన డ్రా..

దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 23తో ముగియనుంది. వచ్చిన దరఖాస్తులకు డ్రా తేదీని 27న ఖరారు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారతి గార్డెన్‌లో డ్రా నిర్వహించనుండగా, కామారెడ్డి జిల్లా కేంద్రంలో రేణుక గార్డెన్‌లో నిర్వహించనున్నారు.



### ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలి

మద్యం టెండర్లకు దరఖాస్తు గడువు ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించాం. ఈ నెల 18 వరకే గడువు ఉండడంతో ప్రభుత్వం గడువును మరో ఐదు రోజులు పెంచింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం 27న లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు జరుగుతుంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి.

– హన్మంత్ రావు, కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి



## ఆర్టీవో కార్యాలయంలో స్వచ్ఛభారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా టెస్టింగ్ సెంటర్‌లో పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి టెస్ట్ డ్రైవ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో చేస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమం విజయవంతంగా 25 వారాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బోడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, సుమన్, నరేందర్, ముధుసూదన్, గణేష్, వేణు, రాజేందర్, ఆదిత్య, కృషి వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



## గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని బస్సాపూర్ గ్రామంలో ఆదివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. 182 పశువులకు ఉచితంగా టీకాలు వేసినట్లు బాల్కొండ పశువైద్యాధికారి గౌతమ్ రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులు ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులను వ్యాధుల నుండి రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రవీణ్, గోపాలమిత్ర ప్రణీత్, మల్లేశ్, షకీల్, గ్రామస్థులు ఐలాపురం మల్లయ్య, కుమ్మరి గంగామల్లయ్య, జాపు పెద్దమల్లేష్, కౌడ చిన్నయ్య, కుంట శ్రీనివాస్, తోట పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌ను హత్య చేసిన నిందితుడిని ఉరితీయాలి




**అక్షరటుడే, ఇందూరు:** కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్యచేసిన నిందితుడు రియాజ్‌ను ఉరితీయాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఉన్న పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితుడు రియాజ్ దొరికిన నేపథ్యంలో ప్రభుత్వం ఉరితీయాలన్నారు. అలాగే కానిస్టేబుల్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భవిష్యత్తులో ప్రజలు, పోలీసులపై దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, గోపి, కార్తీక్, చంద్ర, అఖిలేష్, బాలకృష్ణ, మణికంఠ, శ్రేయస్, టోనీ, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని గోన్‌గొప్పుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అంతా ఒక్క చోట కలుసుకున్నారు. 22 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులంతా కుటుంబసభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులతో రోజంతా సరదాగా గడిపారు. చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శ్రీనివాస్, వెంకటరమణ, కృష్ణస్వామి, ఇంద్రసేనా రెడ్డి, లింబగిరి, ప్రసాద్, రాములు, వినోద్, రాజేశ్వర్, నవీన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్ గౌడ్, మూర్తి ముదిరాజ్, మజర్, నవీన్, ఖలీం, భూమేశ్వర్, జగన్, చంద్, జమున, సుమతి, షబానా, సుమలత, కృష్ణవేణి, శ్రీలత, గంగనర్సు, వరలక్ష్మి, సుమలత, కవిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్‌కే ఎల్లారెడ్డి మండల కమిటీ ఎన్నిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లారెడ్డి మండల కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు మండలాధ్యక్షుడిగా ఇరుసాల రాములు, ఉపాధ్యక్షులుగా అక్కం నాగభూషణం, కొర్రె నారాగౌడ్, కార్యదర్శిగా జంగిట రవి కుమార్, ఉప కార్యదర్శులుగా గడ్డమీది సురేందర్, పోశెట్టి వెంకటి, కోశాధికారిగా కోడూరి చంద్రయ్య ఎన్నికయ్యారు. విద్యుత్ ప్రముఖ్‌గా కొండ మధు, రెవెన్యూ ప్రముఖ్‌గా పట్లోల్ల కిష్టయ్య, బీమా ప్రముఖ్‌గా గుడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విత్తన ప్రముఖ్‌గా కర్రెన్న అంజయ్య, జల ప్రముఖ్‌గా బీమన్‌పల్లి కాశీరాం, ముఖ్య సలహాదారులుగా దస్తయ్య, సురేందర్, గంగాధర్, నారాయణ, రత్నంలను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై బీఎస్‌కే పోరాటం చేస్తుందని, పార్టీలకతీతంగా రైతులంతా ఒక్కటి కావాలన్నారు.




## భావ ప్రకటన, జీవించే స్వేచ్ఛ కోసం పోరాటం

**అక్షరటుడే, ఇందూరు:** ఐదు దశాబ్దాలుగా పౌర హక్కుల కోసం సీఎస్‌సీ పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎన్ నారాయణరావు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సీఎల్‌సీ (పౌరహక్కుల సంఘం) ఉమ్మడి జిల్లా 17వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌరులకు భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జీవించే హక్కు కోసం తమ సంఘం సుదీర్ఘకాలంగా పనిచేస్తుందని వివరించారు. హైకోర్టు న్యాయవాది, సీఎల్సీ రాష్ట్ర నాయకుడు వి రఘునాథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులకు జవాబుదారీగా ఉండి అమలు చేయాల్సిన నైతికత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆల్గోట్ రవీందర్, జలంధర్, బీక్ సింగ్, భాస్కరస్వామి, విజయరామరాజు, ప్రవీణ్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, న్యూడెమోక్రసీ నేత పాపయ్య పాల్గొన్నారు.

## పేకాడుతున్న పలువురి అరెస్ట్

**అక్షరటుడే, బోధన్:** మండలంలో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మచ్చేందర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని అమ్దాపూర్‌లో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.6,180 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా చిన్నమావంది గ్రామంలోనూ పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ. 5వేల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.


నిజామాబాద్‌లో పూల కొనుగోళ్లు..

# దీపావళి సందడి


కామారెడ్డిలో..


కామారెడ్డిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


కామారెడ్డి పట్టణంలో పటాకుల దుకాణం వద్ద సందడి..


నిజామాబాద్ నగరంలో దొంతులను కొనుగోలు చేస్తున్న ప్రజలు